# అవసరం

ఎల్.వి.రమణ



**అటూ ఇటూ తోసినట్టయింది ఒక్కసారి బస్సు ఆగేసరికి. ఎముకలు విరిగే కుదుపులతో మూడుగంటల ప్రయాణం. బయట చీకటి. బస్సు లోపల ఆరుతుందో, వెలుగుతుందో చెప్పడానికి వీలులేని మసక వెలుగు. అలసటవల్ల పట్టీపట్టని నిద్ర.**

అంతలోనే ఓ పెద్ద కుదుపు. మళ్లీ బలవంతంగా మెలకువ. మెలకువ వస్తే చీకటి ముసిరినట్టు ఆలోచనలు. వద్దన్నా భయంకరమైన అనుమానాలు.

ఎటు వెళ్లాలి? ఇంకా ఆలోచన సాగకముందే "దిగండిసార్! పాలెం వచ్చింది!' ' కండక్టర్ అసహనంగా అన్నాడు. అవును, తను దిగవలసిన స్టేజి వచ్చింది. ఎటు పోవాలో తెలియదు.

ఏటవాలుగా ఆగిన బస్సులోంచి బరువుగా దిగాడు. నేలమీద కాలుపెట్టడం పెట్టడం బహుశా గోతిలోనేనేమో ... ఆ గోతిలో పడుకున్న కుక్కపిల్ల కుయ్యోమని ఏడుపు. గుండెలు అవిసిపోయాయి. కండక్టర్ "రైట్!" అనడం, ముఖంమీద దుమ్ముకొట్టి బస్సు వెళ్లిపోవడం ఒకేసారి జరిగింది. పేరేగానీ ఊరు తెలియదు. అసలే రాత్రివేళ బస్సు దిగడం. దిక్కు తెలియదు. ఎటుపోతే ఏమి వస్తుందో! భయం కాదు గానీ భయంలాంటిదేదో ఆవహించింది. ఎంతదూరం పోవాలో తెలియదు. దారిలో ఎవరైనా కనపడితే బాగుండును. దారి చూపించే వాళ్లే కనపడరా!

చిక్కని చీకట్లో చుక్కల్లా దూరాన దీపాలు కనిపిస్తున్నాయి. కళ్లు ఉన్నా లేకపోయినా సమానమే దారితెన్నూ తెలియని పల్లెటూర్లో చీకట్లో! జాగ్రత్తగా నడవాలి. ముళ్లు ఉంటాయి. అలా అనుకుంటూనే, తెలియకుండానే గోతిలో కాలువేశాడు. గుండె అదిరిపోయింది. తూలిపోయాడు. పడిపోలేదు.

కీచురాళ్ల రొద. మిణుగురు పురుగులు, దోమలు. దూరంనుంచి 'ఎవురది' ఎవరో పలకరింపు. చీకటిలో కొరివిదయ్యంలాగా నిప్పుకణిక కదులుతున్నది. ఎవరో చుట్టకాలుస్తూ తనవైపు వస్తున్నట్టు గ్రహించాడు.

"ఎవురదంటే మాట్లాడవేం?" మళ్లీ అదే గొంతు. పల్లెటూరిలో తెలియని చుట్టరికాలు అలానే ఉంటాయని తెలిసినా ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటో తెలియదు. ఆ చుట్ట దగ్గరకు వచ్చింది.

వస్తూనే "ఏ వూరు మంది? ఎవరింటికి?" అని అడిగింది.

ఇప్పుడు సమాధానం తేలికైపోయింది. "మాది బెజవాడ. సావిత్రమ్మగారింటికి!" సమాధానమిచ్చాడు.

"ఏ సావిత్రమ్మా?"

ఒళ్లు మండిపోయింది. వీడికెందుకో .... అన్నీ అనవసరమైన ఆరాలే! పల్లెటూళ్లే అంత! అయినా ఏమని చెప్పాలి. తనకు తెలిసిన సావిత్రమ్మగురించి చెప్పాలా? సాధ్యం కాదు. అసలు తనకు అంతకంటే మరో సావిత్రి తెలియదు. చెప్పకపోతే ఇల్లు ఎలా చేరడం పెద్ద చిక్కే.

నీళ్లు నమిలాడు. ఎలా చెప్పాలి?

"జమేదార్ సావిత్రమ్మ అయితే తిన్నగా పోవాలి. చెరువు వస్తుంది. తూర్పున మూలమీద ఇల్లు. జాగర్తగా ఎల్లాల!" రవ్వంత వెటకారంగా అంటూ వెళ్లిపోయింది చీకట్లో చుట్ట.

ఏడిసినట్టు ఉంది. ఊరికి కొత్త. చీకటి. కరెంటు లేదు. తూర్పు పడమరలు ఎలా తెలుస్తాయి?

నడుస్తున్నాడు. ఆపాదమస్తకం అదిరిపోయేటంత దెబ్బ. కాళ్ల చెప్పులు తెగిపోయేటంత ఎదురుదెబ్బ ... ముచ్చెమటలు పట్టాయి. అయినా తట్టుకుని నిలబడ్డాడు.

ఒకపక్కనుంచి పిల్లలు ఎవరో లాంతర్లు పట్టుకుని వస్తున్నారు. అర్థమైంది. తనవైపే వస్తున్నారు. ఎవరో పిల్లాడు "ఎవరు కావాలండీ? ఎవరింటికీ?" అన్నాడు మర్యాదగానే. పిల్లాడే నయం.

"సావిత్రమ్మ గారింటికి .... ఇంటికి తీసుకెడతావా?"

"ఏ సావిత్రమ్మగారండీ? సిటీపోలీస్ సావిత్రమ్మగారా, జమేదార్ సావిత్రమ్మగారా?" అన్నాడు ఒక లాంతరు.

ఈ ఊళ్లో ఇద్దరున్నారన్నమాట. ఇద్దరూ చాలా పేరున్నవాళ్లేనల్లే ఉంది. సిటీ పోలీస్ సావిత్రమ్మ అంటే బోధపడింది. జమేదార్ సావిత్రి ఎవరో తెలియదు.



# ఆరోగ్యానికి అనాస

ఆయా సీజన్లలో లభించే పళ్లను ఓ సారైనా తినడంవల్ల రోగనిరోధకశక్తి పెంపొందుతుందని పెద్దలంటారు. వానకాలంలో అనాసపళ్లు ఎక్కువగా దొరుకుతాయి. తొక్క తీయడం కాస్త కష్టమైనా, అనాస పండు చాలా రుచిగా వుంటుంది. మధురమూ, రసవంతమూ అయిన అనాసలో ఔషధగుణాలూ వున్నాయి.

పండులో 60-65 శాతం తినదగింది. ఇందులో ఏడు-ఎనిమిది శాతం వుండే చక్కెరవల్ల తీయగా వుంటుంది. రక్తాన్ని ఫిల్టర్ చేసేగుణంవున్న అనాస, శరీరంలోని విషపదార్థాలను బయటికి తోసెయ్యడంలో వుపయోగపడుతుంది.

అనాస తినడంవల్ల రక్తం శుభ్రపడటంతోపాటు, ముఖానికి కాంతి కలుగుతుంది. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. ఆకలి మందగించివుంటే అనాసరసం లేదా లోపలి పల్ప్ తీసుకోవాలి. దాంతో ఆకలి పెరుగుతుంది. మలబద్ధం వుంటే పచ్చి అనాసరసం తీసుకోవాలి.

అనాసరసం తీసుకోవడంవల్ల కడుపులోని పురుగులు నశిస్తాయి. పిల్లలకు కడుపులో నులిపురుగులుండటం సహజం. ఉపయోగకరమైన క్రిమినాశినిగా అనాసరసం పని చేస్తుంది.

అనాస షర్బతు, మురబ్బా రుచికరంగా వుంటాయి. షర్బత్ వల్ల దాహం తీరుతుంది. అతిమూత్రవ్యాధి తగ్గుతుంది. అనాసలో ఏ.బి.సి విటమినులున్నాయి. కళ్లకు చల్లదనంతోపాటు కాంతినీ అనాస ఇస్తుంది. అనాసలోని కేల్షియం, ఫాస్ఫరస్, ఐరన్‌కూడా తగినంత వున్నాయి. అనాస తొక్కకూడా వుపయోగకారే. దీంతో మేలు చేయగల వినిగర్ తయారవుతుంది.

నీల

---

"తెలియదబ్బాయ్! వాళ్లది మాత్రం పేట. అంతే తెలుసు!"

"అదేలెండి పేట సావిత్రమ్మగారన్నమాట! మాతో రండి!" అంటూ లాంతరు పిల్లలు ముదుకు నడక ప్రారంభించారు. వాళ్లేదో పుస్తకాలు, పాఠాలు, మాస్టర్లగురించి మాట్లాడుకుంటున్నారు.

కలుపుగోలుగా "ట్యూషన్‌కు పోతున్నారా?" అన్నాడు.

"మీకెలా తెలుసండీ?" అడిగాడు ఒక పిల్లాడు ఆశ్చర్యంగా.

"నేను కూడా ఒకప్పుడు పిల్లాడినే. మీలాగే ఇలాగే లాంతర్లు పట్టుకుని నైటవుట్లు చేసినవాడినే. ట్యూషన్ల పేరుతో తిరిగినవాడినే!" అన్నాడు.

పిల్లలు నవ్వారు. తనకు మాత్రం నవ్వు రాలేదు. మనసంతా చిన్ననాటి ట్యూషన్లకు పోయింది. పిల్లలేవో మాట్లాడుకుంటున్నారు. తను నడుస్తున్నాడు.

"ఆ ఇల్లేనండీ!" ఇల్లు దగ్గరకు రాగానే ఆ అబ్బాయి హెచ్చరించాడు.

తనకు ఎదురుగా మరో లాంతరు వస్తున్నది. పది పన్నెండేళ్ల పిల్ల. నాజూకుగా ఉంది. "ఆలస్యమైందేం, చక్రం? మాస్టారు తిడతారు! తొందరగా నడవండి!" అన్నది. ట్యూషన్ పిల్లలు వెళ్లిపోయారు.

గేటు దగ్గరకు వెళ్లేసరికి కుక్క మొరిగింది.

"ఎవరదీ?" ఎవరో స్త్రీ కేక. లాంతరు తీసుకుని గేటు దగ్గరకు వచ్చింది.

వచ్చింది సావిత్రి అయి ఉండదని లాంతరు వెలుగులో ఖరారు చేసుకున్నాడు.

"సావిత్రమ్మగారు కావాలి!"

"మీ పేరు?" మర్యాదగానే అడిగింది.

చెప్పాడు. "ఆగండి, అమ్మగారికి చెప్పి వస్తాను!" అని లోపలకు పోయింది.

కొంతసేపటికి మళ్లీ వచ్చి గేటు తెరిచి లోపలకు తీసుకుపోయింది. పెద్ద లోగిలి. రెండు నిలువుతెట్టు ధాన్యం పురులు రెండో మూడో కనిపించాయి. ఎడ్లు కూడా ఉన్నాయేమో తమాషాగా ఏదో వాసన. లాంతరు వెలుగులో పలుపు తాళ్లు, నాగలి దుంపలు, పురుగుమందులు, ఎరువుల బస్తాలు, ట్రాక్టర్ సామాన్లు ... అంతా పల్లెటూరి మోతుబరి రైతు ఇంటి వాతావరణం.

సావిత్రి వచ్చింది. వస్తూనే లాంతరు పెద్దది చేసింది. ఏమీ మాట్లాడలేదు. కాస్త తేరుకున్నట్టు ఉంది.

"మీ పేరు మూర్తి కదూ! పేట కదా! ఇప్పుడు బెజవాడలో ఉంటున్నారు కదూ!"

మూర్తికి ఇంటినుంచి బయలుదేరినప్పటినుంచి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టే ఉంది. ఎలా పరిచయం చేసుకోవాలి. తనను సావిత్రి గుర్తుపడుతుందా? అసలు ఆమె మనసులో పూర్తిగా చెరిగిపోయానేమో ... పాతికేళ్ల తరువాత ఏమని వెళ్లేది? ఎలా వెళ్లేది? అయినా పోక తప్పదు! అవసరం అలాంటిది. కనుక ప్రయాణం తప్పలేదు.

"అవును మూర్తినే!" గొణిగాడు. ఇప్పుడు ఆమె పలకరింపు కాస్తంత ధైర్యం ఇచ్చింది.

"ఎందుకు నూతిలోంచి మాట్లాడినట్టు ... బిగ్గరగా మాట్లాడు! నేనే సావిత్రిని! ఆనాటి సావిత్రినే! ఇప్పుడు గుర్తుకు వచ్చానన్నమాట? ..." ఏమిటేమిటో మాట్లాడేస్తోంది. అలా మాట్లాడటం చిన్నప్పుడు కూడా అలవాటే!


అతడికి గుక్కతిరగలేదు. విభ్రమంలాంటిదాన్నుంచి తేరుకోలేదు.

మళ్లీ అందుకుంది. "నేనే వాగేస్తున్నాను, మాట్లాడవేం? పాతికేళ్ల తరువాత కనబడుతూ ఇలాగేనా మాట్లాడేది? పాతికేళ్ల గతం గురించి మాట్లాడుకోవడం అంత సులభం కాదులే, లే, స్నానం చెయ్యి!"

అంతా హడావుడి చేసేస్తోంది. చూస్తుండగానే ఎవరో కమతగాడు వచ్చాడు. సావిత్రి వచ్చింది. రెండు తువాళ్లు ఇచ్చింది. కమతగాడు బాత్రూమ్‌కు తీసుకుపోయాడు. జాగర్తగా నడవాలి.


# టెలి-వర్కింగ్ పద్ధతి

## సైబర్ సరిగమలు



పుప్పల నరసింహం

కొందరికి నమ్మశక్యం కాకపోయినా, ఇది పూర్తి వాస్తవం...కార్యాలయం లేకుండా ఒక పత్రికను ముద్రించడం, ప్రపంచంలోని నలుమూలలకు దాన్ని పంపించడం అంటే ఆశ్చర్యం కలగకమానదు. ఒక బ్రిటీష్ పత్రికకు భారతీయవ్యక్తి సంపాదకులు. అతను తన ఇంట్లోనుంచే తన పత్రికకు కావలసిన వ్యాసాలను, సమాచారాన్ని ఇంటర్‌నెట్‌ద్వారా సేకరిస్తారు. వాటిని ఎడిట్ చేసి, పశ్చిమ ఇంగ్లండ్‌లోని మరో సంపాదకునికి పంపుతారు. అక్కడ తుదిమెరుగులు దిద్దుకున్నాక, నవీముంబయిలో పేజీల లే-అవుట్ చేసి, మళ్లీ ఇంగ్లండ్‌కు పంపుతారు. ఇదంతా కేవలం కార్యాలయంలేకుండా కొన్ని టెలిఫోన్ కాల్స్‌తో పూర్తవుతోంది. ఇదే నేటి పనివిధానం...దీనినే టెలి-వర్కింగ్ అంటున్నారు.



ఇటువంటి పనివిధానం ఒక్క పత్రికా రచయితలకేగాక, ఇతర ఉద్యోగు లకూ ఉపయుక్తంగా ఉంది. అభివృద్ధిచెందిన దేశాల్లో ఇది ఒక సాంఘిక విప్లవాన్ని తీసుకొచ్చింది. గంటలతరబడి ప్రయాణం చేసి తమ కార్యా లయాలకు చేరుకొని అలసిపోయి పనిచేయడంకన్నా, అనుకున్న సమ యంలో ఈవిధంగా పని పూర్తికావడంపట్ల అటు యాజమాన్యం, ఇటు ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డెస్క్ జాబ్ అంతా ఈ టెలి-వర్కింగ్‌పద్ధతిలో పూర్తిచేయవచ్చు. ఈ పద్ధతివల్ల అద్దెకు తీసుకున్న పెద్ద కార్యాలయాల అద్దెఖర్చు తప్పడమేకాక, దాని మెయిన్‌టైన్ ఖర్చులూ తప్పుతున్నాయని యాజమాన్యం అంటోంది. టెలీవర్కర్స్‌కు కొన్ని నష్టాలున్నప్పటికీ మహిళలను ఈ పద్ధతి విపరీతంగా ఆకర్షిస్తోంది. ఇంట్లో ఉంటూనే, ఇంటిపనులు చేసుకుంటూనే సంపాదించుకోవడానికి ఇది ఎంతో అనువుగా ఉంది. ఈ విధానంవల్ల భారతదేశంతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అక్షలాది, డాలర్లు అందుతున్నాయి. ఇదొక వరంగా భావిస్తున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ వ్యాపారం ఇందుకు ఎంతో అనుకూలంగా ఉంది. ఈ సాఫ్ట్‌వేర్ బిజినెస్‌లో భారత్‌కు గణనీయమైన వాటా ఉంది. దీంతో సంప్రదాయ వ్యాపారపద్ధతికి, కార్యాలయాలపద్ధతికి పరదా పడినట్టే!

వచ్చేవారం:
సైబర్ బాంకింగ్ ■

---

తెలియని చోటు. చీకటి. కరెంటు లేదు. లాంతరు వెలుగులోనే వేడినీళ్ల స్నానం చేస్తున్నాడు.

"రాముడూ! పొద్దున్నే మీ ఆవిడని కూడా తీసుకురా! ఇహ నువ్వు వెళ్లు!" అన్నది సావిత్రి.

స్నానం చేసి బయటకు వచ్చేసరికి ఆరుబయట మంచం వేసి ఉంది. తెల్లటి దుప్పటి. తన పరిస్థితి అసహ్యంగా ఉంది. తానేమీ లుంగీ కూడా తెచ్చుకోలేదు. ఆమాటే అనేశాడు.

"నీకింకా పాత మనస్తత్వం పోలేదు. నీ సంగతి తెలిసిందే! ఇంకా మారలేదనడానికి ఇంతకంటే ఏం కావాలి? దూరదృష్టి ఉంటే మంచిది కదా! పొరుగూరు పోతూ వెంట తువ్వాళ్లు, లుంగీలాంటివి ఎవరైనా తెచ్చుకుంటారు. పోనీలే, మనమధ్య ఈ పట్టింపులు వద్దు! ఈ ఇంట్లో లుంగీలుగానీ, ధోవతులుగానీ లేవు. తెల్లచీరలే ఉంటాయి!" దులిపేసింది.

"ఆ దూరదృష్టే ఉంటే నా జీవితం ఇలా ఉండదు ...!" తన పరిస్థితిని చెప్పుకున్నాననుకున్నాడు.

"ఎక్కువ కామెంట్ అక్కరలేదు. నీ జీవితం అంటావేమిటి? మన జీవితాలు ఇలా ఉండేవి కావు అను! లుంగీ లేకపోతే ఫర్వాలేదు. నా తెల్లచీర ఉంది. మడతపెట్టి కట్టుకో!"

స్టార్చ్ పెట్టిందల్లే ఉంది. ఇస్త్రీ మడత. సందేహించకుండా కట్టేసుకున్నాడు.

"మూర్తీ ...! నీకు చీర బాగుంటుంది!" గలగల నవ్వేసింది.

"ఈ నవ్వు విని ఎన్ని సంవత్సరాలైంది? అసలు జీవితంలో నవ్వు మనం చిన్నప్పుడు కలిసి తిరిగిన రోజులతోనే పోయింది!" అన్నాడు.

"నవ్వు సంతోషానికి గుర్తు అంటావా?" అంటున్నప్పుడు గొంతులో రవ్వంత బాధ కనిపించింది.

"... ఇప్పుడు కూడా నీకు తెలియదేమో, ఆ రోజు నువ్వు ధైర్యం చేసి ఉంటే మనిద్దరికీ పెళ్లి జరిగేది కదా! ధైర్యం చేయలేకపోయావు. ఇహ నా విషయం ... నాది పేదరికం చేసిన పెళ్లి. సుఖపడింది లేదు. పడుతున్నది లేదు. నీకు తెలుసో తెలియదో గానీ పల్లెటూళ్లో ఒంటరి ఆడదానికి ఇంత ఆస్తి, వ్యవసాయం, లావాదేవీలు ... వీటివల్ల ఎన్ని బాధలో నీకు తెలియదు. పెద్ద కాలక్షేపం. ఇవే లేకపోతే పిచ్చెక్కి చచ్చిపోయేదాన్ని. ఇందులో కూడా సుఖం లేదు. ఎన్ని రంకులకు, బొంకులకు గురవుతుంటానో తెలీదు. నేను దిక్కులేని దాన్నని తెలిసి కొందరు ఉంచుకుంటాననీ, కొందరైతే పెంచుకోమనీ రకరకాలుగా వత్తిడి చేస్తున్నారు. అలవాటైపోయింది. నాకు తెలుసు నా చాటున నా

గురించి ఏమనుకుంటారో, నీకు తెలయిదు. ఇది పల్లెటూరు. ఆస్తి ఉన్న ఒంటరి ఆడదాని పరువు ..." దాదాపు ఏడుపు వస్తున్నట్టే అనిపించింది.

"నీకు నేను అన్యాయం చేశాను కదూ, సావిత్రీ!" గుండె బరువును, నిస్సహాయతను మాటల్లో నింపి చెప్పాడు.

"అలా అనుకుంటే దుఃఖమే. నువ్వు నాకేమీ చెయ్యలేదు. నాకు జరిగింది. నిమిత్తం నువ్వు. నిమిత్తం లేకుండా ఈ సృష్టిలో ఏదీ జరగదు. ఇది తెలుసుకునేసరికి ముసలితనం వచ్చేస్తుంది."

"అదేమిటో నాకు తెలియదు గానీ, నీకుమాత్రం ముసలితనం రాలేదు. నాకు అలా కనిపించడంలేదు. నా కళ్లకు ఇంకా ఆనాటి సావిత్రివే! ఇక జీవితంలో దుఃఖం అంటావా, నా ప్రారబ్ధం!"

"ఈ మెట్ట వేదాంతం నాకు మింగుడు పడడంలేదు. ఇప్పుడదంతా ఎందుకుగానీ నీ పిల్లాడికెలా ఉంది?"

ఆశ్చర్యపోయాడు. తన గురించి, తన పిల్లాడి గురించి ఎలా తెలుసో? ఆ మాటే అడిగాడు.

"వెరీ సింపుల్! మనకు ఆసక్తి ఉన్న వాళ్లగురించి ఎలాగైనా తెలుస్తుంది. నవ్వు నాకు ఎంత కాకుండా పోయినా, నీగురించి ఇన్నేళ్లనుంచి ఆలోచిస్తూ చాలావాటికి దూరమైపోయాను. ఎందుకో ఆయన పోయిన తరువాత నీ గురించి ఆలోచనలు ఎక్కువయ్యాయి. నీ జీవితంలో భాగం పంచుకోకపోయినా, నీ కష్టసుఖాల్లో పాలుపంచుకోడానికి నీతి, న్యాయం ... అదే నీ భార్య అడ్డం వస్తున్నది!"

"బాధపడకు. ఆవిడకు అన్నీ తెలుసు. ఒకవేళ నవ్వు వచ్చినా భయం లేదు ...!" అనడంలో తన భార్య గొప్ప మనస్తత్వమో, ఎలాంటి గతాన్ని అయినా తేలికగా తీసుకోగలిగే 'అభ్యుదయ' భవసంపన్నురాలో వ్యక్తం కాకుండా జాగ్రత్తపడ్డాడు.

సావిత్రి నవ్వేసింది. "దాందేముందిగానీ, అసలు నీ కొడుకు ఆరోగ్యం ఎలా ఉందో చెప్పలేదు. చెప్పాలని లేదా?"

ఎనస్థీషియా ఇవ్వకుండానే చర్మం కోస్తున్నట్టనిపించింది. తనకు చెప్పాలని లేకపోవడమేమిటి? వచ్చిందే అందుకు. అందులోనూ కన్నబిడ్డ కడుపుకోత పెడుతున్నప్పుడు తనవాళ్లు కనిపించినప్పుడు చెప్పుకోలేకపోవడమనేది ఉండదు. సావిత్రి అలా అడిగినప్పుడు గొంతులోకి ఏడుపు వచ్చేసింది. తింటున్న అన్నం మింగుడుపడలేదు.

"ఎంతమాట అన్నావు, సావిత్రీ! ఏమని చెప్పను? నా నిస్సహాయత వల్ల వాడికి రోజులు దగ్గరపడ్డాయి, వాడిని బతికించుకోలేనేమో ... నెలజీతంమీద బతికేవాణ్ణి. నాలాంటివాడికి రావలసిన కష్టం కాదు!" అంటున్నప్పుడు కన్నీళ్లు విస్తరిలో పడ్డాయి.

సావిత్రి మనసు ద్రవించిపోయింది.

"కష్టాలు లేనివాళ్లకే కాదు, ఉన్నవాళ్లకు కూడా రావచ్చు. కాకపోతే డబ్బుతో కొంత ఊరట వస్తుందేమో! ఈ మాటలు ఎందుకుగానీ, డబ్బుతో తీరే సమస్యలు మాటలతో తీరవు. వాడిగురించి భయపడకు. ఎంత డబ్బు అయినా వెనకాడకు. నేను ఇస్తాను. వాడుమాత్రం నా పిల్లాడు కాడా! నేనే దత్తత తీసుకున్నాననుకో! వాడు పూర్తి ఆరోగ్యంతో ఆస్పత్రినుంచి తిరిగి వస్తాడు. నీ భార్యకు చెప్పు, నేను దత్తత తీసుకుంటా! ఆ రకంగా మన ఇద్దరికీ ఒక కొడుకు ఉంటాడు!"

ఆ మాటలు వింటున్నప్పుడు అతని చేతుల్లో అన్నంముద్ద కిందపడిపోయింది. ఆనందంతోనే, ఉద్వేగంతోనే!

"నీ రుణం తీర్చుకోలేను, తీర్చుకోగలిగేది కాదు! ఆ శక్తి కూడా నాకు లేదు, సావిత్రీ!" గొంతు గాద్గదికమైంది.

మాట మార్చితేగానీ కుదరదనుకున్నది సావిత్రి. "ఫస్ట్ బస్సు తెల్లవారుజామున నాలుగింటికి ఉంది. అప్పటికి డబ్బు సిద్ధం చేస్తాను. వాడికోసమే అన్నట్టు పంట డబ్బు ఇవాళే చేతికి వచ్చింది. బ్యాంకులో వేద్దామనుకుంటున్నాను. ఇప్పటికి లక్ష సిద్ధంగా ఉంది! ముందు ఇది తీసుకుపో. రేపు సాయంత్రానికి ఇంకా తెస్తా! పిల్లాడిని చూస్తా! నీ భార్యను ఈ విధంగా కలుసుకుంటా."

తెల్లవార్లూ కబుర్లు చెప్పుకున్నారు. ఏవేవే కబుర్లు. అయినా గుండెల్లో ఇంకిపోయిన విరాగాలు, కన్నీళ్లు కలసి వెరసి తెచ్చిపెట్టుకున్న సంతోషంగా అనిపించింది, కనిపించింది ఇద్దరికీ ... ఒకరికొకరికి.

"మూర్తీ! నీకు ఫామిలీ ప్లానింగ్ అంటే తెలుసా?" దగ్గరగా జరుగుతూ అడిగింది. ఇక మంచానికి అవతల అంటూ లేదు.

అదిరిపడ్డాడు.

"మాట్లాడవేం ...? ఫామిలీ ప్లానింగ్ అంటే తెలుసా, తెలయిదా?" గోముగా అడిగింది. ఆ మాటల్లో మబ్బు విడిచిన ఎండ తీవ్రత కనిపించింది.

తేరుకుని, ఆమె నడుం చుట్టూ చేతులు వేసి "ఆపరేషన్ చేయించుకున్నా!" అన్నాడు.

"నీ ముఖం! ఫామిలీ ప్లానింగ్ అంటే కుటుంబాన్ని ఒక ప్లాన్ ప్రకారం నడుపుకోవడం, నీకు చేతకాదని తెలిసిపోయింది. ఇహనుంచి నేను ప్లాన్ చేసి నడిపిస్తాను. మనకు లింక్ మనబంధం, మన పిల్లాడు. నీ పెళ్లాం ప్రేక్షకురాలే! భయపడకు గౌరవంగానే చూస్తాలే!" అన్నది మీదకు వాలిపోయి ... కరిగిపోయి అతడ్ని మరగపెడుతూ!

చూస్తూండగానే నాలుగైంది. డబ్బు సంచి చేతికి ఇస్తూ సావిత్రి "ఒక్కటి గుర్తుంచుకో, నిమిత్తం లేకుండా బంధాలు ఏర్పడవు. ఇహనుంచి మనం సంతోషంగా ఉండాలి!"

"చీకట్లో వచ్చి చీకట్లో వెళ్లిపోతున్నా!" అంటూ వెనకచూపు లేకుండా వెళ్లిపోయాడు.

❀ ❀ ❀

డబ్బు దొరికిన సంతోషంతో ఇంటికి చేరాడు. కొత్త ఊపుతో, నిక్షిప్తమైన ఆరోగ్యంతో పిల్లాడు ఇంటికి వస్తాడన్న ధైర్యంతో ఇంటికి చేరాడు.

గడపలోనే భార్య చిరునవ్వుతో కనిపించింది.

భర్తను చూడగానే, "ఇహ మనకు భయం లేదండీ! డబ్బు కావలసినంత దొరికింది. మీకు ఒకసారి చెప్పానే ... నాకు వరసకు మేనమామ ఉన్నాడని. ఆయన్ని అడిగాను. మారు మాట్లాడకుండా యాభైవేలకు చెక్కు ఇచ్చాడు. ఆయన రుణం తేలికగా తీరదు!"

"అవును, కొందరి రుణాలు తీరేవి కావు. అసలు మనం తేలికగా రుణపడిపోతాం. నేను కూడా తెచ్చా! నీకు చెప్పానే ... ఆవిడ డబ్బు ఇచ్చింది!" అంటూ ఉండగానే ఇరవై ఏళ్ల కూతురు బజారు నుంచి వస్తూనే, "డాడీ! అన్నయ్యకు ఇక భయం లేదు. నా ఫ్రెండ్ వాళ్ల నాన్నగారికి మన పరిస్థితి చెప్పా. ఆయన ఎంతో జాలిపడ్డాడు. నిన్ను రమ్మన్నాడు డబ్బిస్తానట్ట!"

మాటలు పూర్తికాకముందే లోపలనుంచి చిన్నకూతురు గావుకేక పెట్టింది. అదిరిపడి లోపలకు వెళ్లి చూస్తే కొడుకు గిలగిల బాధతో మెలితిరిగిపోతున్నాడు. అన్నీ ఉండి ఏమీ లేనివాళ్లయిపోయారు. కన్నబిడ్డ జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు, "ఏం భయంలేదు, నాన్నా! మేము ఉన్నాం! ఆస్పత్రికి పోదాం!" అన్నాడు లేని ధైర్యం కూడగట్టుకుని.

"మీ అందరి రుణం తీర్చుకోకుండానే పోతున్నా! నన్ను క్షమించరూ!"

ఏడుపు పట్టలేక కూతురు అక్కడనుంచి వెళ్లిపోయింది. అవును, ఎంతచెడ్డా అన్నయ్య కోసమే ... ఎంచెడ్డా కొడుకు కోసమే ... కూతురుతోపాటే వాళ్లిద్దరూ!

■